బీరంగూడ, ఏడుపాయల జాతరకు బస్సులు

రాయదుర్గం: మహా శివరాత్రిని పురస్కరించుకొని పటాన్‌చెరు నుంచి బీరంగూడ ఆలయానికి అలాగే ఏడుపాయల జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో, మియాపూర్‌ డిపో, కూకట్‌పల్లి డిపోలకు చెందిన బస్సులను బీరంగూడ వరకు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ డిపో అధికారులు సూచించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ఆల్విన్‌కాలనీ: రామ్‌దేవ్‌రావ్‌ ఆసుపత్రిలో జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సీఈఓ డాక్టర్‌ యోబు ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులకు బుధవారం ఉదయం 12 గంటలకు రామ్‌దేవ్‌రావ్‌ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

27న విద్యార్థుల నిరసన

రాయదుర్గం: ప్రభుత్వం వెంటనే టీఎస్‌–ఈ పాస్‌ ఫెలోషిప్‌లను అందించాలని హెచ్‌సీయూ స్టూడెంట్స్‌ యూనియన్‌ డిమాండ్‌ చేసింది. ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయాలని నిర్ణయించారు. విద్యార్థి లోకమంతా సంఘటితం కావాలని వారు కోరారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..

గచ్చిబౌలి: విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. మంగళవారం గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలలో సెల్ఫ్‌ గవర్నమెంట్‌ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో పాఠాలు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, మధుమతి, టీచర్లు అమర్‌, సుజాత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

శివపూజకు వేళాయె..

ముస్తాబైన శైవ క్షేత్రాలు.. పూలు, పండ్లకు డిమాండ్‌

గచ్చిబౌలి/రాయదుర్గం: మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలను పూలు, మామిడిఆకులు, విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. గచ్చిబౌలి, జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌, ఇందిరానగర్‌, గౌలిదొడ్డి, సాయిఐశ్వర్య, టెలికామ్‌ నగర్‌, కొండాపూర్‌, కొత్తగూడ, నానక్‌రాంగూడ ప్రాంతాల్లో ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు స్వహస్తాలతో శివుడికి అభిషేకం చేసే అవకాశాన్ని కల్పించారు.

◆ జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో , ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్‌ హనుమాన్‌ధామ ఆశ్రమ్‌ ఆలయంలో కాశీ విశ్వనాధుడికి పంచామృతాభిషేకం చేయవచ్చు.


రాజరాజేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి


కాశీ విశ్వేశ్వరస్వామి


శివసాయిక్షేత్రంలో..


బీరంగూడ ఆలయంలో..

నేడు బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన

టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో శివలింగానికి ఉదయం 10.30 గంటలనుంచి 12.30 గంటల వరకు బిల్వార్చన, రాత్రి 7 గంటల నుంచి సహస్ర జ్యోతిర్లింగార్చన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాగా హెచ్‌సీయూలో రాష్ట్రీయ కళామంచ్‌ ఆధ్వర్యంలో మహాదేవునికి ప్రత్యేక పూజను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5 గంటలకు ఈస్ట్‌ క్యాంపస్‌లోని మష్రూమ్‌రాక్‌ రోడ్డులోని శివాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిస్తామని రాష్ట్రీయ కళామంచ్‌ ప్రతినిధులు తెలిపారు.

శాంతిసరోవర్‌లో..

గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో రుద్రాక్షలతో భారీ శివలింగంను ఏర్పాటు చేశారు. బుధవారం ప్రత్యేక జాగరణ్‌ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన, మెడిటేషన్‌, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి.

బీరంగూడలో ఉత్సవాలు ప్రారంభం

పటాన్‌చెరు టౌన్‌: అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ గుట్టపై కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో మంగళవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గణపతి పూజ, స్వామి వారికి అభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆలయ ఈఓ శశిధర్‌, జూనియర్‌ అసిస్టెంట్‌, మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ... బుధవారం మహాశివరాత్రి నేపథ్యంలో తెల్లవారుజామున రెండు గంటలకు రుద్రాభిషేకం జరుగుతుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూ లైన్‌ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పెరిగిన పండ్లు, పూల ధరలు



చందానగర్‌: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పండ్లు, పూల ధరలు పెరిగిపోయాయి. చందానగర్‌, తారానగర్‌ మార్కెట్లలో వీటి ధరలు మండిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పండ్లు చాలా వరకు రూ.100 దాకా పలుకుతున్నాయి. పూలు దాదాపు రూ.400 కేజీ విక్రయిస్తున్నారు. మూర పూలు రూ.50 పలుకుతోంది. తర్బూజ కిలో రూ.70, పుచ్చకాయ రూ.25–35 మధ్య ఉంది, ద్రాక్ష రూ.100 కిలో పలుకుతోంది.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన


ప్రేమ్‌నగర్‌లో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ హమీద్‌ పటేల్‌

చందానగర్‌: కాలనీల అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్నామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలో సుమారు రూ.65 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్‌ హమీద్‌ పటేల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్తాండనగర్‌ కాలనీలో రూ.25 లక్షలు, ప్రేమ్‌నగర్‌ ఏ బ్లాక్‌ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంను అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి డివిజన్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌ ఆలిండ్‌ ఎంప్లాయిస్‌ కాలనీ, భాగ్యలక్ష్మీనగర్‌ ఫేజ్‌–2లలో సుమారు రూ.65 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌తో పీఏసీ ఛైర్మన్‌ గాంధీ మంగళవారం శంకుస్థాపన చేశారు.

హలీం తయారీలో శుభ్రత పాటించాలి


హలీం విక్రయదారులతో సమావేశమైన వెస్ట్‌ జోనల్‌ వెటర్నరీ డీడీ విల్సన్‌

గచ్చిబౌలి: రంజాన్‌ మాసంలో హలీం తయారీలో శుభ్రత పాటించాలని శేరిలింగంపల్లి వెస్ట్‌ జోనల్‌ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్‌ విల్సన్‌ పేర్కొన్నారు. మంగళవారం వెస్ట్‌ జోనల్‌ కార్యాలయంలో జడ్సీ ఉపేందర్‌ రెడ్డి ఆదేశాల మేరకు హలీం విక్రయదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. రంజాన్‌ మాసంలో హలీం విక్రయించే వారు నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. కల్తీ పదార్థాలు వాడొద్దని, శుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వెటర్నరీ ఆఫీసర్‌ బాసిత్‌, మెడికల్‌ ఆఫీసర్లు, ఫుడ్‌ సేఫ్టీ అధికారులు, అసిస్టెంట్‌ సిటీ ప్లానర్స్‌ పాల్గొన్నారు.

కులగణన సర్వేపై అవగాహన

చందానగర్‌: చందానగర్‌ డివిజన్‌ వార్డు కార్యాలయంలో మంగళవారం కులగణన సర్వేపై అవగాహన కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌ సభ్యులు తిరుమలగిరి సురేందర్‌, చందానగర్‌ సర్కిల్‌ ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ విభాగానికి చెందిన బి.కేశురామ్‌, ఏఎంసీ సంజయ్‌ విజయ్‌, కాలనీ అధ్యక్షులు ప్రసాద్‌, రాంబాబు, బాబీరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులగణన సర్వే ప్రాముఖ్యత, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కె.భూషణ్‌, కాలనీ ఉపాధ్యక్షులు భువనేశ్వర్‌ ప్రసాద్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.


చందానగర్‌ వార్డు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


భాగ్యలక్ష్మీ అమ్మవారు


ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం పంచగవ్యప్రాసన, వాస్తు పూజ, వాస్తు హోమం, లక్ష్మీ మహాయజ్ఞం తదితర పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తుకారామ్‌, మహదేవ్‌, ఉమాజి, సుభాష్‌, సత్యాజి, సంతోష్‌చారి, శ్రీకాంత్‌రెడ్డి, రాజురెడ్డి, జయంధర్‌రెడ్డి, శివకుమార్‌ , భక్తులు పాల్గొన్నారు.

టీవర్క్స్‌లో ఫ్లాష్‌మాబ్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్‌లో కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. దాదాపు 1000 మంది విద్యార్థులు, యువత చిత్రాలను తిలకించారు. టీవర్క్స్‌, ఆర్టిజన్స్‌ ఫ్లీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఫ్లాష్‌మాబ్‌లో విద్యార్థులు, యువత నృత్యాలు ఆకట్టుకున్నాయి, కాగా కళలు, కథలు, ప్రదర్శనలు, సృజనాత్మక అంశాలపై గీతాభాస్కర్‌, హరీష్‌ భాగవతులు, ఇషాక్‌జియా, ప్రియతమ్‌లతో చర్చా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

లింగంపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన జీఎం అరుణ్‌కుమార్‌

శేరిలింగంపల్లి: దక్షిణ మధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌ అరుణ్‌కుమార్‌ జైన్‌ మంగళవారం లింగంపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌ రీ మోడలింగ్‌ పనులను అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌ తాడిబోయిన రామస్వామియాదవ్‌ లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్లుగా వసతులు పెంచాలని అరుణ్‌కుమార్‌ను కోరారు. ముఖ్యంగా ఈ స్టేషన్‌ మీదుగా వెళ్ళే హుస్సేన్‌సాగర్‌, రాజ్‌కోట్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను నిలపాలని, పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ను తెనాలి వరకు పొడిగించడం, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను దుగ్గిరాలలో ఆపాలని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా స్టేషన్‌లో వికారాబాద్‌ వైపు ఉన్న ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జికి ఫ్లాట్‌ఫారం 4లో లిఫ్ట్‌ ఏర్పాటు చేయాలని కోరారు. సికింద్రాబాద్‌ వైపు 1,2 ఫ్లాట్‌ఫారాలను కలుపుతూ లిఫ్టులతో ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మించాలన్నారు. ఎంఎంటీఎస్‌ రైళ్ళను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు నడపాలని కోరారు.

27న నిధి ఆప్‌ కే నిఖత్‌

పటాన్‌చెరు టౌన్‌: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి నిధి ఆప్‌ కే నిఖత్‌ 2.0ను ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్‌ విశాల్‌ అగర్వాల్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలను ఉదయం 9:30 నుండి సాయంత్రం 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా కు సంబంధించి... నల్లగండ్ల నుండి తెల్లాపూర్‌ రోడ్డులో ఉన్న సాధన ఇన్ఫినిటీ స్కూల్‌ లో, మెదక్‌ జిల్లాకు సంబంధించి... శివంపేట్‌ మండలం, నవపేట్‌ గ్రామ పరిధిలో ఫ్లెమింగ్‌ ల్యాబ్స్‌ లిమిటెడ్‌లో, సంగారెడ్డి జిల్లాకు సంబంధించి... ఇస్నాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం అరబిందో ఫార్మల్‌ లిమిటెడ్‌లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్నవారుఈ మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

15 రోజుల పసికందు మృతదేహం లభ్యం

మియాపూర్‌: మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని హాఫీజ్‌పేట్‌ హనీఫ్‌ కాలనీ సమీపంలో ఓ పసికందు మృతదేహం లభించింది. స్థానికులు దీనిపై మియాపూర్‌ పోలీసులకు సాయంత్రం 6 గంటల సమయంలో సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా 15 రోజుల నుండి 20 రోజుల వయసున్న పసికందుగా గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు నిర్మానుష్య ప్రాంతంలో పసికందును పడవేశారు. ఈ మేరకు పసికందు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ పర్వీద్‌ హమ్మద్‌ తెలిపారు.

బాలిక అదృశ్యం

మియాపూర్‌: బాలిక అదృశ్యమైన సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌ న్యూ కాలనీకి చెందిన బొమ్మాల మహేశ్వరి(16) 10వ తరగతి చదువుతుంది. ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆందోళన చెందిన సోదరుడు శివయ్య మియాపూర్‌ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.